క్లుప్తంగా

ప్రభావతికి సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ ఇన్ తెలుగు అవార్డు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు టీచర్ గుండేపల్లి ప్రభావతికి, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ ఇన్ తెలుగు అవార్డు శనివారం దక్కింది. గత రెండేళ్లుగా ఎస్ఎస్‌సీ మెటీరియల్ ప్రిపరేషన్‌లో చేసిన బెస్ట్ సర్వీస్‌కు గుర్తింపుగా పై అవార్డుకు ఆమె ఎంపికయ్యారు. ఈ మేరకు అమలాపురంలో ఆర్జేడీ నాగమణి, డీఈవో సలీం బాషా చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. కాగా అవార్డు అందుకున్న ప్రభావతికి సహచర టీచర్లు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

మాజీ సర్పంచ్‌కు వేణు నివాళి

సఖినేటిపల్లి: మోరి మాజీ సర్పంచ్ జాన విజయలక్ష్మి ఫ్లెక్సీ వద్ద శనివారం మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే ప్రముఖ పారిశ్రామికవేత్త లింగోలు పెద్దబ్బులు, మాజీ సర్పంచ్ ముప్పర్తి త్రిమూర్తులు కూడా ఫ్లెక్సీ వద్ద నివాళులర్పించారు. అంతకు ముందు ఆమె భర్త జాన శంకరరావు(బాబ్జీ)ను వేణు, పెద్దబ్బులు పరామర్శించారు.

నిత్యాన్నదానానికి విరాళం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలుచేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన శ్రీఘాకోళ్లపు శ్రీనివాస్ రూ.10,116 విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు సమర్పించినారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

మామిడికుదురు: స్థానిక బాలికల వసతి గృహం విద్యార్థులకు శనివారం నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.స్వర్ణలత ఆధ్వర్యంలో 63 మంది విద్యార్థినులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి మందులు అందజేశారు. హెల్త్ ఎడ్యుకేషన్‌పై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం తీసుకోవాలని, పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. శీతాకాలంలో ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సీహెచ్ఓ కేసీహెచ్ సత్యవతి, హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ ఓ.రోషిణి, కె.శిరీష, ఏఎన్ఎంలు ఎం.జయకుమారి, కె.దుర్గాదేవి, ఆశ కార్యకర్తలు కె.లక్ష్మీకుమారి, బి.మాధురి పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుల బైండోవర్

అయినవిల్లి: మండలంలోని బెల్ట్ షాపు నిర్వహిస్తున్న రామమూర్తి, కనకదాసులను అమలాపురం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బైండోవర్ చేసి శుక్రవారం అయినవిల్లి తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ వద్ద హాజరుపరిచారు. బెల్ట్‌షాపు నిర్వాహకులు రామమూర్తి, కనకదాసులకు ఒక్కొక్కరికి రూ.లక్ష ష్యూరిటీ విధించి విడుదల చేశారు. బెల్ట్ షాపులను నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరుపై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని దళిత హక్కుల పోరాట సమితి డిమాండ్ చేసింది. శనివారం ఈ మేరకు తాటిపాక సెంటర్‌లో జిల్లా కన్వీనర్ దేవ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పాలతో అభిషేకం చేసి నివాళులర్పించారు. భారత పార్లమెంట్ వ్యవస్థతో పాటు యావత్ దేశ పరిపాలనా వ్యవస్థకు అంబేడ్కర్ మార్గదర్శకుడిగా నిలిచారన్నారు. దళిత నాయకులు నల్లి శ్రీనివాస్, బొంతు మణిరాజు, భూపతి వెంకటపతి బత్తుల జనార్దనరావు, మెడబల రాజ్‌కుమార్, ఉండ్రు జాన్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ గణిత దినోత్సవం

మలికిపురం: ప్రపంచానికే గణితం నేర్పించిన ఘనమైన ప్రాచీన భారతీయ విజ్ఞానశాస్త్ర వారసత్వానికి ప్రతీక, గణిత శాస్త్ర మేధావి శ్రీనివాస రామానుజన్ అని విశ్వేశ్వరాయపురం జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు చింతా బాలచింతామణి కొనియాడారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా మలికిపురం ఎంవీఎన్‌జేఎస్, ఆర్‌వీఆర్ డిగ్రీ కళాశాల గణిత విభాగం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ప్రపంచ గణిత రంగానికి భారతదేశపు ప్రముఖ శాస్త్రవేత్తలు అందించిన తోడ్పాటు వివరించారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక ప్రగతిలో గణిత శాస్త్రానికి ఎనలేని ప్రాధాన్యం ఉందని, శ్రీనివాస రామానుజన్ గణిత శాస్త్రంలో చేసిన ఆవిష్కరణలు ప్రపంచ ప్రఖ్యాతి పొందాయని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నల్లి ఆనంద మహాని, గణిత శాస్త్ర విభాగాధిపతి శిరిగినీడి నాగభూషణం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఆర్‌జీఈఎస్‌లో రూ.9.02 కోట్ల పనులు

ఆలమూరు: ఎన్ఆర్‌జీఈఎస్ పథకం కింద మండలంలోని 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.9.04 కోట్లతో 671 పనులు చేపట్టినట్లు డ్వామా పీడీ వి.మధుసూదన్ తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనం ఆవరణలో శనివారం ఎంపీడీఓ ఎ.రాజు ఆధ్వర్యంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పీడీ మధుసూదన్ పాల్గొని సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలోని 18 గ్రామాల్లో గత 15 రోజుల నుంచి ఎస్ఆర్‌పీ వి.కనకారావు నేతృత్వంలో ఐదుగురు డీఆర్‌పీలు నిర్వహించిన గ్రామస్థాయి సామాజిక తనిఖీలో గుర్తించిన లోపాలపై పీడీ ఆరా తీశారు. కొన్ని గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించి ఆమేరకు అపరాధ రుసుం విధించనున్నట్లు ఏపీడీ ఎం.సత్యనారాయణ, ఏపీఎం జి.అరుణకుమారి తెలిపారు.


ఆలమూరులో కేక్ కట్ చేసి మాజీ సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు


అంబాజీపేటలో జగన్ పుట్టినరోజు కేకును అభిమానులకు పంచుతున్న నాయకులు


కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి


అప్పనపల్లిలో జగన్ బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి

సంక్షేమానికి చిరునామా జగన్

- వాడవాడలా జన్మదిన వేడుకలు
- కేక్ కటింగ్‌లు, సేవా కార్యక్రమాలు
- పాల్గొన్న కో ఆర్డినేటర్లు, నాయకులు


విలసలో రోగులకు దుప్పట్లు, పండ్లు పంచుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు


పి.గన్నవరం సీహెచ్‌సీలో బాలింతకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న పార్టీ శ్రేణులు

కొత్తపేట: ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలో ప్రజా సంక్షేమానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన చిరునామాగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మాజీ సీఎం జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం నియోజకవర్గ వ్యాప్తంగా జన్మదిన వేడుకలు, సేవా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ కేంద్రం కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్‌లో మాజీ సీఎం దివంగత రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద జగన్ బర్త్‌డే కేక్‌ను జగ్గిరెడ్డి కట్ చేసి అందరికీ పంచారు. ఆయన మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబంలో ఆనంద కాంతులు కనిపించేవన్నారు. నేటి కూటమి ప్రభుత్వం చెప్పిన పథకాలు అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేసిందని విమర్శించారు. దాంతో పేద, మధ్యతరగతి ప్రజలు మదన పడుతున్నారన్నారు. సంక్షేమ పాలన అందించడంలో జగన్‌కు జగనే సాటి అని వారు వేనోళ్ల కొలుస్తున్నారన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, గర్భిణులు, బాలింతలకు, పేదలకు పాలు, పండ్లు, రొట్టెలు, చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో అముడా మాజీ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్ రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, దూనబోయిన నవదీప, ఎంపీటీసీలు పేపకాలయ బ్రహ్మానందం, బొక్కా నాగరాణి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు సాకా జానకిరామరాజు, మండల యువజన విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి స్వరూప్, గ్రామ శాఖల అధ్యక్షులు సలాది బ్రహ్మాజీ, గొల్లపల్లి శ్రీనివాసరావు, భూపతిరాజు సత్యనారాయణరాజు, కాకర సర్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతి అని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి పేర్కొన్నారు. జగన్ పుట్టినరోజు వేడుకలను శనివారం మామిడికుదురు మండలంలో ఘనంగా నిర్వహించారు. అప్పనపల్లిలో పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన జగన్ బర్త్‌డే కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి కేక్ కట్ చేశారు. 20 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ఎంపీటీసీ బొంతు నీలిమ, మాజీ సర్పంచ్ పిచ్చిక చిన్న, మాజీ సొసైటీ మాజీ అధ్యక్షులు గెద్దం కృష్ణమూర్తి, పార్టీ నాయకులు తులా గోపాలకృష్ణ, గెద్దం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్‌లో కేక్ కట్ చేశారు. ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ నేతలు చిక్కం బుజ్జిబాబు, మొల్లేటి త్రిమూర్తులు, కొనుకు నాగరాజు, పాముల ప్రకాష్, పిల్లి శ్రీనివాస్, వాసంశెట్టి రామకృష్ణ, మోకా విజయ్‌రాజు, బొరుసు చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: మాజీ సీఎం జగన్ సుపరిపాలనా దక్షుడని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. మలికిపురం మండలంలో జగన్ పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మలికిపురం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి అభిమానులకు, కార్యకర్తలకు పంచారు. పాటి శివకుమార్ సమకూర్చిన దుప్పట్లను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి పేదలు మెచ్చిన ఏకైక నాయకుడిగా జగన్ గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు బల్ల ప్రసన్నకుమారి, మట్టా శైలజ, నెడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్, జిల్లా నాయకులు కేఎస్ఎన్ రాజు, భూపతిరాజు సత్తిబాబు రాజు, కంచర్ల శేఖర్, సూరిశెట్టి బాబి, కటకం శెట్టి ఆదిత్య, కూనపరెడ్డి రాంబాబు, మండల శాఖల అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్, కట్టా శ్రీనివాసరావు, దొంగ ఏసు, సీతామహాలక్ష్మి, కొల్లాబత్తుల సతీష్, యెనుముల నారాయణస్వామి, ఈద రవిరెడ్డి, గుబ్బల రోజారమణి, మనోహన్, తాడి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు: మాజీ సీఎం జగన్ పుట్టినరోజును మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం అట్టహాసంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని సంబరాలు జరుపుకొన్నారు. ఆలమూరులోని బస్టాండ్ సెంటర్ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ నేలపూడి లావణ్య అధ్యక్షత వహించగా ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు నెక్కంటి వెంకట్రాయుడు, నామాల శ్రీనివాస్, చల్లా వెంకట సుబ్రహ్మణ్యం, గుణ్ణం రాంబాబు, రావాడ సత్తిబాబు, మోటుపల్లి వెంకన్న, నాయుడు ప్రసాద్ తదితరులు పాల్గొని మాజీ సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. అలాగే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పార్టీ శ్రేణులు పలు సేవా సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెంటపాటి వెంకట్రావు, నెక్కంటి ప్రకాష్, బోయిడి కుమారి, వనుం జార్జిబాబు, మేరీ, నాతి కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు. అలాగే జొన్నాడలోనూ పార్టీ నేతలు నాంద్ర నాగమోహన్‌రెడ్డి, ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణరెడ్డి, తాడి మెహెర్ ఆదిత్యరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నేతలు బర్త్‌డే వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు. సర్పంచ్ కట్టా శ్రీనివాసు, తాడి నాగమోహన్‌రెడ్డి, కట్టా రామకృష్ణ, గొలుగూరి బుచ్చిరెడ్డి, జి.సూర్రెడ్డి, ఎస్.జ్యోతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: జన హృదయాలను గెలిచిన నాయకుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో మిగిలిపోతారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. అంబాజీపేట బస్‌స్టేషన్ ఎదురుగా దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బర్త్‌డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి అభిమానులకు పంచారు. అనంతరం స్త్రీల ఆస్పత్రి వద్ద రోగులకు పండ్లు, పాలు, రొట్టెలను పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, ఎంపీపీ డి.వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్.స్టాలిన్‌బాబు, పార్టీ నాయకులు పీకే రావు, ఎం.కిరణ్‌కుమార్, కె.కోటబాబు, డి.సత్యమోహన్, కె.బేబిరాణి, ఎంఎం శెట్టి, కె.వరలక్ష్మి, ఎం.ప్రశాంత్ పాల్గొన్నారు.

పి.గన్నవరం: మాజీ సీఎం జగన్ పాలనలో పేద వర్గాలకు ఎంతో మేలు జరిగిందని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు ఏవీ సాయిరామ్, డీవీ శివరామన్, పి.నర్సింహారావు అన్నారు. మండల పార్టీ ఆధ్వర్యంలో శనివారం పి.గన్నవరంలో జగన్ బర్త్ డేను ఘనంగా నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులు పేరిచర్ల రామరాజు, కుమార్‌రాజుల సహకారంతో సీహెచ్‌సీలో బాలింతలు, గర్భిణులు, రోగులకు పాలు, బ్రెడ్లు, పండ్లు పంచారు. కార్యక్రమాల్లో పార్టీ సర్పంచ్ కొంబత్తుల ఏసుబాబు, నాయకులు ఎం.వరలక్ష్మి, డి.కాశీ, డి.దుర్గారావు, సరెళ్ల అప్పారావు, డి.సీతారామయ్య, కె.రవికుమార్, గుత్తుల మధు, జల్లి శ్రీను, కె.వెంకటేశ్వరరావు, పుచ్చకాయల నర్సింహమూర్తి, రాజు, ఎస్.రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అయినవిల్లి: మాజీ సీఎం జగన్‌తోనే రాష్ట్ర ప్రజలకు ప్రజా సంక్షేమం అందుతుందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ ఆరోపించారు. జగన్ పుట్టినరోజు వేడుకలను అయినవిల్లి, మడుపల్లి, శానపల్లిలంక తదితర గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం విలస న్యూలైఫ్ సెంటర్‌లో జగన్ జన్మదిన కేకు కట్ చేసి రోగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి వెంకటరమణ, గుమ్మడి ప్రసాద్, కుసుమ సునీల్‌కుమార్, మిండగుదిటి రాంబాబు, చెట్ల రామారావు ఉన్నారు.

సఖినేటిపల్లి: పేదల ఉజ్వల భవిష్యత్‌కు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యా సంస్కరణలు తెచ్చారని రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శనివారం సఖినేటిపల్లి మార్కెట్ యార్డు సెంటర్లో వైఎస్సార్ విగ్రహం వద్ద మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పుట్టినరోజు కేక్‌ను గొల్లపల్లి కట్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, గ్రామశాఖ అధ్యక్షుడు నల్లి ప్రేమానందం, పరిషత్ కో ఆప్షన్ మెంబర్ బళ్ల నోబుల్ ప్రభాకర్, ఎంపీటీసీలు రాపాక దీవెన కుమారి, నల్లి రత్నకుమార్, కమిడి లత, రుద్రరాజు రంగరాజు, నల్లి బాలరాజు, పాటి శివకుమార్, ఈద రవిరెడ్డి, గొల్ల చంటిబాబు, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

రావులపాలెం: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి అభిమానులకు పంచారు.

వినూత్నంగా నవరత్నాల లబ్ధిదారులతో కేక్ కటింగ్

కొత్తపేట: మాజీ సీఎం జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అమలు చేసిన పలు సంక్షేమ పథకాల పేర్లతో వినూత్నంగా తయారు చేయించిన కేక్‌లను కట్ చేశారు. ఆత్రేయపురం అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నిర్వహించిన జగన్ పుట్టినరోజు వేడుకల్లో జగ్గిరెడ్డి వినూత్న రీతిలో జగన్ బర్త్‌డే కేక్ కటింగ్‌తో పాటు నవరత్నాల్లో లబ్ధిదారులను జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి, వారితో కేక్‌లు కట్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో నవరత్నాల రూపంలో జగన్ అనేక సంక్షేమ ఫలాలు అందించారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ అంటూ హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా గాలికొదిలేసిందన్నారు. అనంతరం ఆత్రేయపురం పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, రాష్ట్ర వైఎస్సార్ సీపీ నాయకుడు కర్రి నాగిరెడ్డి, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు కప్పల శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షుడు కనుమూరి శ్రీనివాసరాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ చిలువూరి రామకృష్ణంరాజు, ఎంపీటీసీ సరెళ్ల ధనలక్ష్మి, నాయకులు పి.రాజగోపాలరాజు, ముదునూరి కృష్ణంరాజు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల ట్రోఫీ కరపత్రాల ఆవిష్కరణ


సంక్రాంతి సంబరాలను లాంఛనంగా ప్రారంభించిన కలెక్టర్ మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట: అఖండ గోదావరి నది ప్రాంతం ప్రకృతి అందాలు, రమణీయత మధ్య ఎంతో ఆహ్లాదకరంగా పర్యాటకులను కను విందు చేస్తుందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. శనివారం ఆత్రేయపురం మండలంలోని లొల్ల లాకుల వద్ద కోనసీమ సంక్రాంతి సంబరాలు పేరిట జనవరి 11, 12, 13 తేదీల్లో నిర్వహించనున్న పడవల పోటీలు, గాలిపటాల పోటీలు, ముగ్గుల పోటీల సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ కరపత్రాన్ని ఆవిష్కరించి క్రీడా పోటీలను లాంఛనంగా జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి ప్రాంత పచ్చదనం, మనసుకు ఆహ్లాదాన్ని కలిగించే గోదావరి నీటి సమశీతోష్ణస్థితి పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటుందన్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో ఈ ప్రాంతం పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయనీ ఆ దిశ గా ఈ ప్రాంతం పర్యాటకంగా విరాజిల్లనుందని ఆయన అభిలషించారు. సంక్రాంతి పండగకు తెలంగాణ ఇతర ప్రాంతాల నుంచి పర్యాటకులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున జనవరి 11, 12, 13 తేదీల్లో ఈ ప్రాంత విశిష్టత, కీర్తి ప్రతిష్ఠలను నలుమూలల వ్యాపింపజేసే దిశగా పడవల పోటీలు, గాలిపటాల పోటీలు, ముగ్గుల పోటీలు, కోనసీమ సంక్రాంతి సంబరాలు సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీని వైభవంగా నిర్వహించడానికి సంకల్పించామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ఆకర్షణీయమైన బహుమతులు ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణులకు అందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కొత్తపేట రెవెన్యూ డివిజనల్ అధికారి పి.శ్రీకర్, ఆత్రేయపురం మండల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

రావులపాలెం: గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ ఎంతో కృషి చేస్తుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గొలుగూరి వెంకటరెడ్డి అన్నారు. రావులపాలెం సీఆర్‌సీలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసోసియేషన్, సీఆర్‌సీ సంయుక్త ఆధ్వర్యంలో 22 నుంచి 25 తేదీ వరకూ రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలను రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు ప్రారంభిస్తారన్నారు. 13 జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయిలో బాలురు, బాలికల విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నాకౌట్ పద్ధతిలో జరిగే పోటీల్లో గెలిచిన బాలుర, బాలికల టీమ్‌లు హరిద్వార్ లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. సమావేశంలో సీఆర్‌సీ కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి, స్పోర్ట్స్ డైరెక్టర్ నల్లమిల్లి వీరరాఘవరెడ్డి, డైరెక్టర్ చిర్ల కనికిరెడ్డి, అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జున్‌రావు, ట్రెజరర్ ఎం.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.


కబడ్డీ పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సీఆర్‌సీ సభ్యులు

అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

సఖినేటిపల్లి: గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయా శాఖల అధికారులు ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వీరా మల్లిబాబు అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మండలాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దేందుకు తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. గుడిమూలలో త్వరలో ఏర్పాటు కానున్న సబ్‌స్టేషన్‌కు ఈ నెలాఖరుకు టెండర్లు ఖరారవుతాయన్నారు. సఖినేటిపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు మండల పరిషత్ గ్రాంటు రూ.20.75 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. శివారు ఏరియాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు అన్నారు. సఖినేటిపల్లి ఫెర్రీ ద్వారా మండలానికి కేటాయిస్తున్న నిధులు, వాటిని ఏయే పనులకు వెచ్చిస్తున్న దానిపై సమావేశంలో ప్రజాప్రతినిధులు చర్చించారు. ఏపీ రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జి.పెదకాపు, డీటీ భాస్కర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.


సఖినేటిపల్లి మండల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు


అయినవిల్లిలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ నాగలక్ష్మమ్మ

అంబాజీపేట: భూ కబ్జాల నుంచి సామాన్యులకు రక్షణ, భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. నందంపూడిలో రెవెన్యూ సదస్సును శనివారం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు అంకితభావం జవాబుదారీతనంతో పారదర్శకంగా నిర్వహించి భూ సమస్యలకు చెక్ పెట్టాలన్నారు. ఎవరైనా భూ సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. అంతకుముందు అర్జీ నమోదు కౌంటర్, రెవెన్యూ రికార్డుల కౌంటర్, శాశ్వత రికార్డుల కౌంటర్లను తహసీల్దార్ పరిశీలించారు. అనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సదస్సులో సర్పంచ్ పి.మంగాదేవి, ఆర్ఐ కె.ఏడుకొండలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈదరాడలో..

మామిడికుదురు: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యాచార్యులు తెలిపారు. ఈదరాడ గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు జరిగింది. ముందుగా గ్రామంలో రెవెన్యూ సదస్సు లక్ష్యాన్ని వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ వద్ద సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి అధ్యక్షతన సదస్సు జరిగింది. భూ సర్వేకు సంబంధించి అయిదు, మ్యుటేషన్‌కు సంబంధించిన 14 దరఖాస్తులు వచ్చాయని మండల ప్రత్యేకాధికారి, పి.గన్నవరం ఏడీఏ ఎస్‌జేవీ రామ్మోహనరావు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే వర్మ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

తాటిపాకలో..

రాజోలు: రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. శనివారం తాటిపాక పంచాయతీ వద్ద సర్పంచ్ కోటిపల్లి రత్నమాల అధ్యక్షతన సదస్సు జరిగింది. భూ సమస్యలు, రికార్డుల్లో తప్పుల సవరణలు తదితర అంశాలను పరిష్కరించుకోవచ్చన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి తొమ్మిది, రైస్ కార్డుల కోసం 185, గృహనిర్మాణానికి 15, పింఛన్ల కోసం 233, ఇంటి స్థలాలు కోసం 220 మొత్తం 668 దరఖాస్తులను స్వీకరించారు. డీఎల్‌పీఓ బుచ్చిరాజు, దేవదాయశాఖ ఈఓ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల నుంచి విముక్తి ప్రసాదించండి

అయినవిల్లి: గ్రామంలోని నివాసం ఉంటున్న పలువురికి చెందిన నివేశన స్థలాలు, ఇళ్లు మొత్తం 10.90 ఎకరాల భూమి అయినవిల్లిలో కొలువైన విఘ్నేశ్వరస్వామివారి సర్వే నంబర్‌లో చూపిస్తోందని అయినవిల్లి గ్రామస్తులు రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు శనివారం ఫిర్యాదు చేశారు. అయినవిల్లి సచివాలయం వద్ద తహసీల్దార్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి దేవస్థానం భూమి సర్వే నంబర్ నుంచి తమ భూమి విడిపించి తమకు డాక్యుమెంట్లలో ఉన్న సర్వే నంబర్‌తో ఆన్‌లైన్ చేయాలని కోరారు. పలు సమస్యలపై 22 అర్జీలు వచాయని తహసీల్దార్ తెలిపారు. అనంతరం గ్రామంలోని క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తహసీల్దార్ తెలుసుకున్నారు. ఈ సదస్సులో ఆర్ఐ రాయుడు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

వేంకటేశా.. గోవిందా


నర్సిపూడిలో అలంకార భూషితుడిగా వేంకటేశ్వరస్వామి

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసియున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో అంతటా గోవింద నామస్మరణతో మార్మోగిపోయాయి. ధనుర్మాసం పవిత్రతను పురస్కరించుకుని ఆయా గ్రామాల్లోని ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసిపూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామికి పటికబెల్లం తులాభారంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

బాలాజీ ఆలయంలో భక్తుల కోలాహలం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. స్వామి వారిని దర్శించుకునేందుకు విశేష సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. తెల్లవారు జామున స్వామికి తొలి హారతి, సుప్రభాత సేవ కార్యక్రమాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా మేళ తాళాలు, భక్తుల కోలాహలం నడుమ తీర్థపు బిందెతో వైనతేయ గోదావరి నది జలాలు ఊరేగింపుగా తీసుకువచ్చారు. స్వామి వారి సన్నిధిలో లక్ష్మీ నారాయణ హోమం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2,35,662 ఆదాయం వచ్చిందిన ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు కర్ణాటకకు చెందిన నూలు శివరామకృష్ణబాబ్జి, భారతీరాణి దంపతులు శనివారం రూ.22 వేలు విరాళంగా అందించారు.